# యమగోల

## మండడి తిలక్

"ఎవడీ నరుడు? కుళ్ళుకంపు కొట్టుచున్నాడు, ఛీఛీ" అంటూ రావు గోపాలరావులాగా, కాదా? పోనీ సత్యనారాయణ లాగా, అబ్బసర్లేండి సార్ ఎన్టీరామారావు లాగా సభలోకి ఎంటరయ్యేడు యమధర్మరాజు యమసభ గొప్ప గ్రాండుగా వుంది. రిచర్డ్ అటెన్‌బరో సతీసావిత్రి తీస్తే అందులోని యమసభ సెట్టింగు ఎంత గొప్పగా వుంటుందో అంత గొప్పగా వుంది. యముడి సింహాసనం ప్రక్కనే చిత్రగుప్తుడు చేతులు కట్టుకుని నిల్చుని ఉన్నాడు.

"వీడొక దుర్మార్గుడూ, ఛండాలుడూ నండి! సాహితీ క్రిటిక్కునని పేరొకటి తగిలించుకుని వీడుతిట్టని తిట్టు వాడని బూతు లేవండి. వీడి చేత తిట్లు తినని రచయితంటూ తెలుగు దేశంలో లేరండి. వీడినోరు మహా కంపండి..." వినయంగా విన్నవిస్తూ వున్నాడు చిత్రగుప్తుడు

"అవునవును. తెలియుచునే ఉన్నది" ముక్కుని జేబురుమాలో కప్పుకుని ముఖం చిట్లించి అన్నాడు యమధర్మరాజు.

రాజుగారు ఆ కంపుని భరించలేక పడుతున్న అవస్థ చూసి చిత్రగుప్తుడు జాలిపడి "తమరు దీనికే అంత ఇదయిపోకూడదండి వీడి విచారణ తర్వాత టి.వి. స్టేషను డైరెక్టరుగారి పైన విచారణఉందండి. కంపులో వీడి తలదన్నిన వారండీ వారు" అని చెప్పేడు

ఆదిరిపడిన యమధర్మరాజు "వాడిని నా అసిస్టెంటు చేత విచారింపచేయండి వీడి విచారణఅయిన మరుక్షణము మేము వెళ్ళి సుగంధ ద్రవ్యములలో గొంతుక్కూర్చొవలసి ఉన్నది" అని హడావుడిగా చెప్పేరు.




అప్పుడు వినపడిందో పీలకంఠం. వో మూలనుంచి... "నా విచారణ అంత త్వరగా పూర్తవదులెండి. తొందరేం లేదు" గిరుక్కున అటు తిరిగి చూసేరు యమధర్మరాజు గారు. సన్నగా బారుగా ఉన్నాడో ఎర్రటిమనిషి. కళ్ళజోడు ముక్కుమీదకి జారివుంది. జుట్టు వంకీలుగా భుజాలమీదకి జారివుంది. నడివయసు మనిషి

"వీడే సాహితీ క్రిటిక్కు కనకలింగేశ్వరరావు ప్రభూ" చెప్పేడు చిత్రగుప్తుడు.

"అవున్సార్" వినయంగా ఒప్పుకున్నాడు కనకలింగం.

"నరుడా! నేనెందరో నరులను ఇంతకు ముందు చూచి ఉంటిని కానీ నీయంత కంపుకొట్టు వాడిని ఎన్నడూ చూచి ఉండలేదు నీవద్ద ఏల ఈ కంపు?" అడిగేడు యమధర్మరాజు




"ముందో సంగతి చెప్పండి చూచి ఉంటిని అన్నారు. కళ్ళతో చూశారా? లేక ముక్కుతో చూశారా?" అడిగేడు కనకలింగం.

"ముక్కుతో చీదుదురు గానీ చూతురా? ఎట్లు?"

"చీదడం సరే అనుకోండి! ముక్కుతో 'వాసన' చూతురుకదా?"

"భేష! భేష! తెలివయినవాడవు సాహితీ క్రిటిక్కో క్రొటిక్కో అంటివి. అనగా తెలుగుభాషా సాహిత్యం సృష్టి చేయుదువా?"

"మా దేశంలో తెలివయినవాడు ఎవడూ నవల్లూ గివల్లూ రాయడండి ఫారెను పోవడమో. బిజినెస్సు చెయ్యడమో లేకపోతే కనీసం నవల్లని తిట్టడమో చేస్తారండి—"

"కనుక నీవు నవలలను తిట్టువాడివా?"

"మరేనండి!" పాయింటు కొచ్చారు అన్న సంతోషంతో చిరునవ్వు నవ్వేడు కనకలింగం.

వాసన తగ్గినట్టు ఫీలయ్యారు; యమధర్మరాజు గారు ఇందాకా ఉన్నంత కంపు లేదే నీ దగ్గర అన్న సందేహం వెలిబుచ్చేరు కనకలింగంతో.

"ఇందాకా అంటే అప్పుడే చిత్రగుప్తుడు గార్ని నానా బూతులూ తిట్టేనండి ఆ ఎఫెక్టు కొంచెం సేపు ఉందన్నమాట"

"మా చిత్రగుప్తుడిని అట్లు ఏల తిడితివి?"

"వీడు చాలా పెద్ద పుండాకోరండి" తన ప్రసక్తి రావడంతో మధ్యలో ఇంటర్‌ఫియరయి, కంద గడ్డలాంటి మొహంతో అన్నాడు చిత్రగుప్తుడు

"నువ్వు నోర్మూయ్యి" గర్జించేడు యముడు

నోరు మూసుకున్నాడు చిత్రగుప్తుడు.

—"మళ్ళీవాడు నన్ను తిట్టినచో కంపు భరించలేక నేను అన్యాయముగా చచ్చెదను" అని వాపోయేరు యముడుగారు

"మీకు గొప్ప దూరదృష్టి!" మెచ్చుకున్నాడు కనకలింగం.

యముడిగారి లాజిక్కుతో చిత్రగుప్తుడుకూడా కన్విన్సు అయ్యేడు.

అంతలోకే ఎవరో ఆటెండరు వచ్చి యముడిగారికి శాల్యూటుచేసి నిలబడ్డాడు.

"ఏమి?" అనడిగేరు యముడుగారు.

"మొన్నామధ్య తెప్పించిన కాగితం చుట్టలన్నీ అయిపోయాయిటండి మళ్ళీ చుట్టలు పంపించాల్సి వుందని. ఉమెన్స్ సెక్షను వెల్ఫేరు అధికారిణి నుంచి యమగ్రాఫు అందింది ప్రభూ!"

"కాగితం చుట్టలా? యమలోకం?? ఎందుకూ??? మీవిగాని వెస్టర్న్ టైపు టాయిలెట్లా?!" అనుమానంగా చూస్తూ అడిగేడు కనకలింగం.

"అబ్బెబ్బే! కాగితము చుట్టలు సాహిత్య సృష్టికి నాయనా" చిత్రగుప్తుడు కొంచెం ఇంగ్లీషు పద్ధతులు తెలిసిన వాడవటంచేత సర్ది చెప్పాడు.

"అది సరేగాని చచ్చి ఈ లోకానికొచ్చినా కలం వదలని ఆ ధన్యజీవులి చూడాలనుంది. అవకాశ మిస్తారా?" యముడివైపు తిరిగి అర్థించాడు కనకలింగం.

"ఆదెంత భాగ్యము నీచే భూలోకమునందు అంతగా తిట్టించుకొనబడియూ కలము వదలక వందల టన్నుల కాగితమును వారము రోజులలో నలుపు చేసిన ఆ రచయిత్రీమణులను చూడ నాకునూ మనసగుచున్నది. ఇరువురమూ కలిసియే దర్శింతము" అని యముడుగారు ముందుకి దారితీసేరు. అనుసరించాడు కనకలింగం. ఆ వెనుకే చిత్రగుప్తుడు బైల్దేరాడు వాకరిద్దరు భటులతో సహా!

"నరకం సెక్సు నవలలు అచ్చేసేటందుకనే మారుమూల ప్రింటింగు ప్రెస్సుల్లా వుంది. సర్క్యులేషను లేని గొప్ప సాహిత్య పత్రిక ఎడిటరుగారి భార్యామణి హృదయంలా వుంది. తిరిగొచ్చిన సాధారణయుత ముఖంలా వుంది" అనుకున్నాడు కనకలింగం నడుస్తూ.


ఉమెన్స్ సెక్షను గందరగోళంగా వుంది. భటులంతా ఎక్కడి వాళ్ళక్కడ కూలబడి తలలు కొట్టుకుని ఏడుస్తున్నారు కొంతమంది జుట్టు పీక్కుని కిందపడి దొర్లుతున్నారు కొంతమంది బాగా వేయించిన నూనెలో దబుక్కున దూకి ఆత్మహత్య చేసుకొంటున్నారు యముడుగారు లోపలికి అడుగు బెట్టగానే హోలోమంటూ వాళ్ళంతా ఆయన చుట్టూమూగి, కాళ్ళమీద పడి వలవలా ఏడుస్తున్నారు యముడిగారికి కొంచెం అయోమయంగా అనిపించింది. కాళ్ళని పట్టుకున్న వాళ్ళనుంచి విడిపించుకుని, "ఏమిటి? ఏమయిందసలు?" అనడిగేరు ఆశ్చర్యంగా కంగారుగా

"ఈ చిత్రహింసను మేం భరించలేం ప్రభూ"

"యుగ యుగాలనుంచీ పెడుతున్న చిత్రహింసలే కదా. కొత్తగా ఎల మీకీ మనోవ్యాకులత?"

"అయ్యబాబోయ్ మేం వాళ్ళని పెడుతున్న చిత్రహింసల్ని గురించి కాదు మహాప్రభో చెప్పేది. వాళ్ళు మమ్మల్ని పెడుతున్న చిత్రహింస గురించి......"

"అంటే మీకు వాళ్ళు రాసిన నవలల్ని చదివి వినిపిస్తున్నారా?"




హఠాత్తుగా వినబడిన ప్రశ్నకి ఆశ్చర్యపడి ఏడుపాపేసి చటుక్కున తలెత్తి చూశారు యమభటులు కనకలింగం చిరునవ్వు చిందిస్తూ కనపడ్డాడు

"అయ్యబాబోయ్ అంత సరిగ్గా మీకెలా తెలిసిందండి?"

"ఈ చిత్రహింసని మా లోకంలో నేను ఇంతకుముందే అనుభవించిన వాడినిలే అందుకే మీ బాధ అంత త్వరగా అర్థమైంది" చెప్పాడు కనకలింగం

"నవలలు చదువుట చిత్రహింసయా? సాహిత్యము యొక్క ముఖ్య ప్రయోజనము మానసికోల్లాసమే కదా," యముడుగారు ఇంకా ఆశ్చర్యపడుతూనే ఉన్నారు


"మామూలుగా అంతే యమధర్మరాజా! కానీ మా రచయిత్రీమణుల విషయంవేరు. ఆ రచనలు కంటిన్యువస్‌గా చదివితే నిద్రొస్తుంది వెంటనే దిండుకింద ఆ పుస్తకాన్నే ఉపయోగించి వో కునుకు తీయొచ్చు"

"నమ్మ శక్యముగా లేదు!"

"రోగబంధం, రోగ విపంచిక, రోగలహరి రోగాల పడవలో, ఇలా పుంఖాను పుంఖాలుగా రొష్టి నవలలు రాసిపారేస్తారు మా నవలాకారులు. వాటిల్లో పేర్లు తప్ప మరేమి మారకపోవడం గొప్ప విశేషం! అన్నింటిలోనూ జయంతి చకవర్తిని ప్రేమిస్తుంది. అంతలోకి జయంతిమీద చక్రవర్తిలో లేక ఇన్వర్సుగానో అపార్థం కలుగుతుంది. దానిమీద వో డెబ్భై పేజీలు నడుస్తుంది. లేకపోతే ఇద్దరు హీరోయిన్లుంటారు హీరోగారికి ఒకరిపైనే మనసుంటుంది ఆ ట్రయాంగిలు లవ్వుమీద ఏదో వో మాసపత్రికలో రెండేళ్ళపాటు కథ నడుస్తుంది. చివరికి వో హీరోయినుకి కేన్సరో ఏదో కటి వచ్చి ధామ్మని చస్తుంది భారమైన డైలాగులు. గేలన్ల కొద్దీ త్యాగాలు లీటర్లకొద్దీ సెంటిమెంటూ కలిపి వండబడేవే మా వంటింటి నవలలు మహాప్రభూ." వివరించాడు కనకలింగం



యముడుగారు ఆలోచనలో పడ్డారు అదే సమయమని, భటులంతా ఉమెన్స్ సెక్షను ప్రిమిసెస్ నుంచి ఉరకలు పరుగులతో పారిపో





సాగేరు. కొద్ది క్షణాల తర్వాత యముడుగారు తేరుకుని "వీరివేనా నీవు విమర్శించి ఉంటివి?"

"అవునండా ఈ మీతో అన్న ముక్కలే మా లోకంలోనూ అన్నాను ప్రభూ అదో పెద్ద నేరమైనట్లు ఒక ఫుల్ పేజీ కంప్లయింటు రాసి ఉంచాడు మీ చిత్రగుప్తుడు తన చిఠా పుస్తకంలో."

"చిత్రగుప్తునకు ఉద్వాసన చెప్పవలసిన అవసరము ఎంతైననూ కనపడుచున్నది"

వెనకనే వస్తున్న చిత్రగుప్తుడు ఆ మాటలు విని ధామ్మని కిందపడి మూర్ఛపోయేడు. కోతల్ని కోల్పోయిన రచయిత్రీ మణులందరూ అతని చుట్టూ చేరి నవలా పఠనానికి సిద్ధమయ్యేరు యముడుగారూ కనకలింగమూ నెమ్మదిగా అక్కడినుంచి కదిలేరు.

కొంచెం ఇవతలకి రాగానే, దూరాన యమలోకం ఎయిర్‌పోర్ట్‌లో ఏదో కొట్లాట అవుతున్నట్లు కనపడింది. యముడుగారు ఆత్రపడి ఏమిటబ్బా అని కనుక్కురమ్మని తన కూడా వస్తున్న సాయుధభటులను పరుగెత్తించేరు. వాళ్ళు కొద్దిసేపు

షాలో తిరిగొచ్చి చేతుల్లో జొన్న కంకులు, కుండ పెంకులు కొడవళ్ళు, సుత్తులు పట్టుకుని రెండు గుంపులు కొట్టుకుంటున్నాయనీ, పరిస్థితి తీవ్రంగా ఉందని తెలియజేసేరు. హడావుడిగా అక్కడికి బైల్దేరారు యముడుగారు. ఆయనతో పాటూ గబగబా నడవలేక రొప్పుతున్నాడు కనకలింగం. హఠాత్తుగా కాలిబాట మీద ఉన్న వో అరటి తొక్క మీద కాలువేసి జర్రున జారి పడ్డాడు కనకలింగం దభ్భుమన్న శబ్దానికి ఆగి వెనక్కి చూసిన యముడుగారు ఆశ్చర్యపోయి "అట్లు బురదలో పొర్లెడి ఆనందమేమిటి నీకు కనకలింగమూ?" అనడిగేరు.

తెలుగు పత్రికలలో తలమునకలుగా మునిగి తేలిన వాణ్ని బురదంటే ఇష్టం ఉండటంలో ఆశ్చర్యమేమి లేదు ప్రభూ. ఎంచేతంటే మా సాహితీ వేత్తలు వొకళ్ళమీద వొకళ్ళు తరచుగా అదే చల్లుకుంటూ ఉంటారు"

"అది సరియే! ఇంతకూ అట్లు ఏల క్రింద పడితివి?"

ఇక్కడెవడో సామాజిక స్పృహగల రచయితెవడో ఉన్నట్లున్నాడు సార్ అరటికాయ తిని తొక్క నడి రోడ్డుమీద పారేసేడు..." లింగం ఇంకా మాట పూర్తిచెయ్యక ముందే వొకళ్ళతో వొకళ్ళు కలబడుతూ వో పదిమంది కనకలింగం, యముడుగార్ల మీదకి వచ్చిపడ్డారు. కనకలింగం తప్పుకోగలిగేడు గాని, యముడుగారు మాత్రం ఎన్జీవోల మధ్య ఎన్జీవాడు చిక్కుపడి పోయినట్లు చిక్కుపడి పోయేరు. ఆ దొమ్మిలో వో డజను తోపులు తినేలోపల, ఆయన కూడా ఉన్న సాయుధ భటులు ఆ గుంపుని అతి కష్టంమీద విడతీయగలిగేరు

"ఏమిటీ గొడవ?" గంభీరంగా ప్రశ్నించేరు యముడుగారు, చెదిరిన మీసాన్ని, ధైర్యాన్నీ కూడ గట్టుకుంటూ!"

చెప్పాలా అన్న విషయంమీద వీళ్ల కొట్టుకుంటున్నారు"

"అందులో కొట్టుకొనుటకేమున్నది? వారంత గొప్ప కవి అయినచో అందరూ కలిసియే స్వాగతము చెప్పవచ్చును కదా"

"ఛి ఛీ" అని కంపరంగా మొహం పెట్టి "వీళ్ళు దౌర్భాగ్యులు విప్లవద్రోహులు వీరితో కలసి యుగకవికి స్వాగతించుటా? ఛీ" అని వాపోయాడా ఇందాకటి వి. క. (విప్లవ కవి)

చటున ఎదుటిగుంపు లోంచి వొకడు పెద్ద గొంతుకతో "వీళ్ళు అభ్యుదయ నిరోధకులు. సభ్యత లేనివారు వీళ్ళతో కలవడం ఘోరం అయిన నేరం. యుగకవికి మేమే పెడతాము స్వాగత ద్వారం" అని అరిచాడు ముక్కుపుటాలెగరేస్తూ.



"ఇక్కడికి రాబోతున్న మహాకవిని మేమే ఆహ్వానించాలి" కుండ బద్దలు కొట్టినట్లు స్పష్టంగా చెప్పేడో విప్లవ కవి. (వి.క)

"మహా కవెవరు? ఆయన ఇక్కడికిరావడం ఏమిటి?" ఆశ్చర్యపోయి అడిగేరు యముడుగారు

"ఎవరిగురించండీ మీరు చెప్పేది? విప్లవశ్రీగారి గురించేనా?" అడిగేడు కనకలింగం

"అవును నీకెలా తెల్సు?"

"దార్లో వినిపించారు లెండి" అని యముడిగారి వైపుకు తిరిగి 'విప్లవశ్రీ అని మాకో గొప్ప కవి ఉన్నార్లెండి వారికీ మధ్యే మీవద్దనుండి పిలుపు వచ్చింది ఆయనకి ఎయిర్‌పోర్టులో ఎవరు స్వాగతం

మళ్లీ వొకళ్ళ మీదికి వొకళ్ళు ఎగబడ్డారు

యమ్రాజ్ఞెటుగా ఆ గుంపుని లాకప్పులో తొయ్యమని అనుజ్ఞ ఇచ్చి యమ ధర్మరాజు కనకలింగం వైపుకు తిరిగి "పద. భవనమునకు పోవుదము. తెలుగు సాహిత్యము గురించి నీనుండి మరికొంత తెలిసికొన మనసగుచున్నది. నీపై విచారణ కూడా అచ్చటే కొనసాగించెదను" అన్నాడు

ఇద్దరూ కలిసి భవనానికి నడిచారు. "ఆ కొట్టుకుంటున్న గుంపులో కొందరు విప్లవ రచయితలు మరి కొందరు అభ్యుదయ రచయితలూను. విప్లవంతో అభ్యుదయం సాధింపబడదా? అభ్యుదయవాదుల



విప్లవించదా? అని అనే మేధావులకు కలిగే సందేహం కాదు ఆ కవులదో ప్రత్యేక బాణీ ప్రజా కవిత్వమని వాళ్ళు రాసే దాన్ని గురించి ప్రజలెవరికీ కనీసపరిజ్ఞానం కూడా లేకపోవడం విశేషం ఇందాకా చెప్పిన వంటింటి నవలలకి ఈ రచనలు ఏ రకంగానూ తీసిపోవు కాకపోతే వాటిని జనం చదువుతారు వీటిని జనం చదివినా అర్థంకాదు


పంచాయతీ ప్రెసిడెంట్ల రేపులు వగైరాలు టోకున చెయ్యడం, నవలంతా అయిపోయేదాక జనంబాధలు పడి చివరి రెండు మూడు పేజీల్లో విప్లవించడం. ఏ విప్లవ నవల చూసినా ఇదేకథ. విప్లవం అనేది ఏ ఒక్కడి వల్లనే వచ్చేది కాదని, ఓ భూకామందు తల నరికినట్లు చిత్రిస్తే ఊడిపడేది కాదనీ తెలీని మూర్ఖులు విప్లవ రచయితలనిపిస్తుంది ఆ నవలలు చదివితే. కొట్టండి, నరకండి అన్న నినాద సాహిత్యం ఎంతవరకూ విప్లవాన్ని తెస్తుందో వాళ్ళకే తెలియాలి గొప్పగా కవిత్వం రాసిన వ్యక్తిని ఏదో ఓ సంస్థకి లేదా సమాఖ్యకి పరిమితం చెయ్యాలనే బుద్ధి మా విప్లవ రచయితలది. ఒక శతాబ్దిలో సాహిత్యంలో మార్పులు అనేక కోణాలనుంచి జరుగుతాయనే ప్రాథమిక సత్యాన్ని విస్మరించి ఈశతాబ్దం నాది! అబ్బెబ్బే కాదు నాది అని కొట్టుకునే కవులున్న దేశం మాది మాళవికాగ్నిమిత్రాన్ని వరూధినీ ప్రవరాఖ్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించి రాసే తెలివితేటలు మా రచయితలకే వున్నాయి హరిజనుడు కలెక్టరు కావడంగురించి కథ రాస్తూ అగ్రకుల సంఘాలుండాలని సమర్థించే విశాల దృక్పథంగల వాళ్ళు. పెళ్ళిళ్ళు చేసుకున్న వాళ్ళు అందరూ అర్ధరాత్రి లోపల్లంగాలో కాపురాన్ని ఎగ్గొట్టి రోడ్డునపడాలని బోధించేవాళ్ళు. డబ్బుకి అమ్ముడుపోయి కోజుక్ రకం సొల్లు రాసే వాళ్ళు, సాధారణ సభ్యతను, సంస్కారాన్ని విస్మరించి తిట్టు కవిత్వాన్ని విప్లవ సాహిత్యంగా చలామణిచేసే మిడిమిడి జ్ఞానపు వాళ్ళూ, మా సాహితీ వేత్తల్లో వున్నారు. సమాజానికి ఏ రకంగానూ ఉపయోగపడని ఈ రకం సాహిత్యాన్ని తిట్టడం తప్పా? మీరే ఆలోచించండి..." ఆవేశంగా అడిగాడు కనకలింగం.


భవనంలో సాయంకాలపు నీడలు వ్యాపిస్తున్నాయి ఆలోచన ముద్రలో వున్న యమధర్మరాజులో కొంచెంసేపటికి చైతన్యం కలిగింది.

"తప్పుకాదు. కానేకాదు అయితే మీ సాహిత్యమంతా అలానేవుందా?"

"అలాగే వుందని నేనను నిర్మాణాత్మకంగా ఆలోచించే రచయితలు, రచయిత్రులు లేకపోలేదు. నిజాయితీగల విప్లవకవులూ, అవగాహనగల సాహితీకారులూ వున్నారు. వారికి నా ప్రశంస ఎప్పుడూ లభించింది"

"నీమీద విచారణ పూర్తయింది కనకలింగం" లేస్తూ అన్నారు యముడుగారు. "నీవు చేసింది సరైంది. సాహిత్యంలో పాజిటివ్ అవుట్‌లుక్ లేందే సమాజానికి పురోగతి లేదు ఇంత సిన్సియర్‌గా కృషిచేస్తున్న వాడివి, ఇంత చిన్న వయసులోనే ఇక్కడికి రాకుండా వుంటే తెలుగు సాహిత్యానికి మరింత లాభించి ఉండేది..."



"అది నా స్వయంకృతం మహాశయా! నేను పనిచేస్తున్న పత్రిక ఎడిటరుగారు చెత్త కథల పోటీ ఒకటి పెట్టి దాని తాలూకు పనిని నాకు కేటాయించారు. ఓ రోజు నా డెస్కుమీద కొందరు గొప్ప ప్రసిద్ధ రచయిత(త్రు)ల రచనలు కొన్ని వుండటం చూసి వాటిని చదివాను. చెత్త కథల పోటీకి, ఎంత చక్కని ఎంట్రీలు పంపారు? అని ఆశ్చర్యపోయి వాటికే ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రకటించాను. తీరా చూస్తే అవి సాధారణ ప్రచురణకోసం పంపబడిన రచనలట! అటెండరు పొరపాటువలన నా డెస్కుమీదకి చేరాయి. తమకి జరిగిన అవమానానికి మండిపడిన ఆ సాహితీకారులు నన్ను యమసదనానికి పంపించారు. అదీ నా కథ" నవ్వుతూ ముగించాడు కనకలింగం.

వెర్రిపోకడలతో హాస్యాస్పదమైన సాహిత్యాన్ని ఆస్వాదిస్తున్నట్లూ తనూ నవ్వారు యముడుగారు. ✻



గమనిక : వ్యక్తిగతంగా ఎవరి గురించీ ఈ రచనలో ప్రస్తావించలేదు. జనరల్ ట్రెండ్స్ గురించి మాత్రమే రాయడం జరిగింది. సహృదయంతో ఆస్వాదిస్తారని భావిస్తున్నాను. -రచయిత